క్లుప్తంగా

ఘనంగా ఆరోగ్యమాత జన్మదినోత్సవం



తెనాలిటౌన్: రూరల్ మండలం అంగలకుదురులోని ఆర్‌సీఎం చర్చిలో శనివారం ఆరోగ్యమాత జన్మదినోత్సవాన్ని ఘనంగా జరిపారు. కథోలిక గురువులు ఫాదర్ శౌరిరాజు, ఫాదర్ ఇమ్మానుయేలు, ఫాదర్ జైపాల్, ఫాదర్ సునీల్, సిస్టర్స్ ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. మానవ రక్షణ చరిత్రలో తల్లి పాత్ర అమోఘమని ఆమె చూపించిన పవిత్ర బాటలో అందరూ నడవాలని గురువులు తెలిపారు. కార్యక్రమంలో విచారణ గురువు ఫాదర్ శౌరిరాజు, సంఘ పెద్దలు, సంఘ విశ్వాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు పేదలకు నిత్యావసర సరుకులు అందజేశారు.

అమర కళాకారుల సంస్మరణ సభ



తెనాలిఅర్బన్: తమ రచనల ద్వారా ప్రజా చైతన్యం కోసం నిరంతరం శ్రమించిన ప్రజా కవులు సుంకర సత్యనారాయణ, వాసిరెడ్డి భాస్కరరావు, తుమ్మల వెంకట్రామయ్య, నార్ల చిరంజీవులు ప్రజల హృదయాల్లో ఎన్నటికీ చిరస్థాయిగా నిలిచిపోతారని సీపీఐ నాయకుడు పరుచూరి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. అభ్యుదయ కళాసమితి, ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి సంయుక్త ఆధ్వర్యంలో అమర కళాకారుల సంస్మరణ సభను శనివారం గాంధీనగర్‌లోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించారు. సమావేశంలో సాహితీవేత్త లక్కరాజు లక్ష్మణరావు, కృష్ణ, పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు



తెనాలిఅర్బన్: స్వచ్ఛత పక్వాడాలో భాగంగా అయితానగర్‌లోని ఎస్ఎస్ఎస్ఎం హైస్కూల్‌లో శనివారం చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. డ్రాయింగ్ టీచర్ బెల్లంకొండ వెంకట్ మాట్లాడుతూ విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు పోటీలు నిర్వహించామన్నారు. ఈ నెల 15న గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తామని చెప్పారు. నీటి పొదుపు, స్వచ్ఛ భారత్, మొక్కలు నాటడం, పారిశుద్ధ్యం, పర్యావరణ పరిరక్షణ మొదలైన అంశాలపై మంచి చిత్రాలను రూపొందించారని చెప్పారు. పలువురు ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదర్శనీయుడు ఆలపాటి వెంకట్రామయ్య



తెనాలిఅర్బన్: ఆలపాటి వెంకట్రామయ్యను నేటి రాజకీయ నాయకులు ఆదర్శంగా తీసుకోవాలని పలువురు కోరారు. మాజీ మంత్రి ఆలపాటి వెంకట్రామయ్య 106వ జయంతి సందర్భంగా మున్సిపల్ కార్యాలయం ఎదురు ఉన్న ఆయన విగ్రహానికి శనివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ గుమ్మడి రమేష్, నేలటూరి బెన్ను, కొడాలి శ్రీనివాసరావు, ఉయ్యూరు రాజశేఖర్‌రెడ్డి, మునుసూరి నాగ బసవేశ్వరరావు, నాని, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తపై కేసు నమోదు

తెనాలిరూరల్: ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసిన టీడీపీ కార్యకర్తపై కేసు నమోదైంది. చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ టీడీపీ శ్రేణులు ఇచ్చిన తెనాలి బంద్ పిలుపులో భాగంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు మార్కెట్‌వం తెన వద్ద రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా తెనాలి డిపోకు చెందిన మూడు ఆర్టీసీ బస్సులు నిలిచిపోయాయి. ఐతానగర్‌కు చెందిన టీడీపీ కార్యకర్త కాకుమాను రాము బస్సుల అద్దాలను ధ్వంసం చేశాడు. సమీపంలోనే ఉన్న పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకుని త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. డిపో మేనేజర్ రాజశేఖర్ ఫిర్యాదు మేరకు రాముపై ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం, ప్రభుత్వ ఉద్యోగుల విధులను ఆటంకపరచడంపై కేసు నమోదు చేసినట్టు సీఐ ఎస్.రమేష్‌బాబు తెలిపారు.

లోక్ అదాలత్‌తో ఇరుపక్షాలకు మేలు

- 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి జి.మాలతి
- 437 కేసులు పరిష్కారం
- రూ.3.70 కోట్ల పరిహారం అందజేత



కక్షిదారులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి జి.మాలతి

తెనాలిరూరల్: కేసుల సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్ చక్కటి వేదిక అని, తద్వారా కక్షిదారుల సమయం, ధనం ఆదా అవుతుందని 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి, తెనాలి మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ జి.మాలతి చెప్పారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశానుసారం, రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సూచనల మేరకు శనివారం స్థానిక 11వ అదనపు జిల్లా న్యాయస్థానంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాలతి మాట్లాడుతూ ప్రస్తుతం నమోదవుతున్న కేసుల్లో చాలా వరకు కూర్చొని మాట్లాడుకుంటే పరిష్కారం అవుతాయని, కానీ కక్షిదారులు అనవసరమైన భేషజాలకు వెళ్లి సమయాన్ని, ధనాన్ని వృథా చేసుకుంటున్నారని అన్నారు. న్యాయస్థానంలో కేసులు జరిగితే ఎవరో ఒక్కరే విజయం సాధిస్తారని, అదే మధ్యవర్తిత్వం ద్వారా లోక్ అదాలత్‌లో రాజీ పడితే ఇరుపక్షాలు విజయం సాధిస్తారని పేర్కొన్నారు. ఈ లోక్ అదాలత్‌లో 48 సివిలు, 389 క్రిమినల్ కేసులు పరిష్కారమయ్యాయి. బాధితులకు రూ. 3.70 కోట్లు పరిహారం కింద అందించారు. సీనియర్ సివిల్ జడ్జి శ్రీధర్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పి.రాజశేఖర్, రెండో అదనపు మున్సిఫ్ మేజిస్ట్రేట్ శ్రీసీత, న్యాయవాదులు, కక్షిదారులు, పోలీసులు, న్యాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

బొల్లిముంత వీరయ్య వచన కవిత పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాంబశివరావు, లలితానందప్రసాద్, తదితరులు

తెనాలిఅర్బన్: వీరయ్య రచించిన కవితలు వైవిధ్య భరితంగా ఉన్నాయని రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొల్లిముంత సాంబశివరావు పేర్కొన్నారు. సాహితీ మిత్రుల ఆధ్వర్యంలో బొల్లిముంత వీరయ్య వచన కవిత పుస్తకావిష్కరణ సభను గాంధీనగర్ కవిరాజా పార్కులోని సీనియర్ సిటిజన్స్ హాల్‌లో శనివారం నిర్వహించారు. అనంతరం పుస్తకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బొల్లు లలితానందప్రసాద్, కొత్తపల్లి రవిబాబు, జనసాహితీ రాష్ట్ర అధ్యక్షుడు దివికుమార్, బెనహర్, చందు నాగేశ్వరరావు, కవి బొల్లిముంత వీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

యువతను తప్పుదారి పట్టిస్తున్న బిగ్ బాస్



లక్ష్మీపురం: భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాల్నిదెబ్బతీస్తూ యువతను తప్పుదారి పట్టిస్తున్న బిగ్ బాస్ రియాల్టీ షోను నిషేధించాలని ప్రజానాట్య మండలి జాతీయ కార్యదర్శి షేక్ గని డిమాండ్ చేశారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, పాడుదాం రండి బృందం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాత్రిపూట వచ్చే ఈ బిగ్‌బాస్ రియాల్టీ షో వల్ల యువత నాశనమవుతోందని తెలిపారు. షోని కుటుంబ సభ్యులతో కలసి చూడటం ఇబ్బందిగా ఉందన్నారు. అసభ్యకర ప్రవర్తనలతో సభ్యసమాజం తలదించుకునేలా ఉన్న ఈ షోను తక్షణమే నిషేధించాలని ఆయన డిమాండ్ చేశారు. సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, గాయకుడు కవి పి.ఎస్ మూర్తి మాట్లాడుతూ వివాహం కాని యువతీ,యువకులను ఒక గదిలో ఉంచి పాశ్చాత్య దేశాల మాదిరిగా సహజీవనానికి ప్రేరేపించినట్లు ఈ రియాల్టీ షో నడుస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీని నుంచి ఈ తరం కానీ, భవిష్యత్తు తరాలుగానీ ఏమి నేర్చుకుంటారనేది అంతు చిక్కని ప్రశ్నగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు, సీనియర్ సిటిజన్స్,పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పారదర్శక పాలన కోసమే సచివాలయ వ్యవస్థ



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న కత్తెర హెనీ క్రిస్టినా, పక్కన కత్తెర సురేష్‌కుమార్

తాడికొండ: పారదర్శకపాలన అందించడం కోసమే రాష్ట్ర ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను తీసుకురావడం జరిగిందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అన్నారు. తాడికొండ మండలం లాం గ్రామంలో రూ.40 లక్షలతో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని జెడ్పీ చైర్‌పర్సన్ శనివారం ప్రారంభించారు. క్రిస్టినా మాట్లాడుతూ గాంధీజీ కలలు కన్నా గ్రామ స్వరాజ్యం మీ ముందు ఉందనీ, సచివాలయ వ్యవస్థ ద్వారా అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి పెద్ద పేట వేయడంతోపాటు నిరుద్యోగ సమస్యలను తీర్చేందుకు అన్ని చర్యలు తీసుకున్నందునే నేడు యువతకు పెద్దఎత్తున ఉద్యోగ కల్పన జరిగిందన్నారు. త్వరలో పలు రకాల ఉద్యోగాలు భర్తీ కానున్నాయని తెలిపారు. వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ మాట్లాడుతూ 14 సంవత్సరాలు అధికారంలో ఉన్న చంద్రబాబు ఎప్పుడైనా పేదల గురించి పట్టించుకున్నారా అని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో ఏదైనా పని కావాలంటే ప్రభుత్వ ఆఫీసుల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండేదని, నేడు ఆ పరిస్థితి లేదన్నారు. రాష్ట్రంలో వలంటీర్ల వ్యవస్థ పారదర్శకంగా పనిచేస్తుందని కొనియాడారు. రానున్న రోజుల్లో మరిన్ని అవకాశాలు మన ముందుకు రానున్నాయని పనిచేసే వారికి పట్టం కట్టాలని 2024 ఎన్నికలలో వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ చిమట పూర్ణచంద్రరావు, ఎంపీటీసీ రావూరి దివ్య, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి బొర్రా వెంకటేశ్వరరెడ్డి, వివిధ విభాగాల నాయకులు రాయపూడి రంగారావు, నాగార్జునరెడ్డి, కొండ కిషోర్‌రెడ్డి, బెజ్జం సాయి ప్రసాద్, వై.నాగార్జునరెడ్డి, కొల్లికొండ వెంకటేశ్వరరావు, షేక్ సలీం, తాడిబోయిన శివన్నారాయణ, గునుగునూరు సాంబిరెడ్డి, బోడపాటి ధర్మరాజు, షేక్ హుస్సేన్, దీవెనరాజు పాల్గొన్నారు.

చిరు వ్యాపారికి టిఫిన్ బండి అందజేత



ఎమ్మెల్యే ఆర్కే ఆర్థిక సహాయంతో అందజేస్తున్న టిఫిన్ బండి

తాడేపల్లిరూరల్: నగర పాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి బ్రహ్మానందపురంలో నివసించే భూక్యా శ్రీనుకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) సహాయ సహకారాలతో శనివారం టిఫిన్ బండిని అందజేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధానకార్యదర్శి, తాడేపల్లి జేసీఎస్ కన్వీనర్ ఈదులమూడి డేవిడ్‌రాజు మాట్లాడారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జీలగ పెదగాలయ్య తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలం రేవేంద్రపాడు గ్రామానికి చెందిన నల్లబోతుల నల్లబ్బాయి అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుటుంబసభ్యులకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. రేవేంద్రపాడు సర్పంచ్ పలుకూరి మేరమ్మ ఆ మొత్తాన్ని శనివారం అందజేశారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించిన వారిలో ఉప సర్పంచ్ మాదు నాగ దుర్గ, వైఎస్సార్‌సీపీ నాయకులు కొప్పుల జాకబ్, పలుకూరి శామ్యేలు తదితరులు ఉన్నారు.

రేపు బాలికలకు క్రీడా పోటీలు

పిట్టలవానిపాలెం: మండల కేంద్రంలోని కేర్ ఇంగ్లీషు మీడియం హైస్కూలులో ఈ నెల 11న, సోమవారం అండర్- 14, 17 విభాగాల్లో బాలికలకు క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు మండల క్రీడా కో-ఆర్డినేటర్ మేడిశెట్టి ప్రశాంత్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థినులు తమ పాఠశాల నుంచి ధ్రువీకరణ పత్రం తీ సుకు రావాలని, స్కూలు అకడమిక్ మానిటరింగ్ నందు నమోదు చేసుకోవాలని తెలిపారు. అండర్-14 విభాగానికి 2010, జనవరి 1, అండర్-17 విభాగానికి 2007,జనవరి 1 తర్వాత జన్మించిన వారు అర్హులని తెలిపారు. కబడ్డీ, ఖోఖో, టెన్నికాయిట్, వాలీబా ల్, త్రోబాల్, బాల్ బ్యాడ్మింటన్, యో గ, అథ్లెటిక్స్ ఉంటాయని పేర్కొన్నారు.

ఆత్మహత్యలు సమస్యలకు పరిష్కారం కావు



ఆత్మహత్యల నివారణ ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థినులు

గుంటూరు ఎడ్యుకేషన్: చిన్న సమస్యను ఎంతో పెద్దదిగా ఊహించుకుని జీవితాన్ని అర్ధంతరంగా ముగించడం ఏ మాత్రం శ్రేయస్కరం కాదని ప్రముఖ మానసిక వ్యక్తిత్వ వికాస నిపుణురాలు డాక్టర్ చంద్రికారెడ్డి పేర్కొన్నారు. సాయిబాబా రోడ్డులోని జీవీఆర్ అండ్ ఎస్ మహిళా కళాశాలలో స్పందన ఇదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం ఆత్మహత్యల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా చంద్రికారెడ్డి మాట్లాడుతూ సమస్యకు పరిష్కారాన్ని కనుక్కోవడం ద్వారా దాన్నుంచి బయటపడవచ్చని తెలిపారు. ఫౌండేషన్ డైరెక్టర్ అంజిరెడ్డి మాట్లాడుతూ 2020లో డాక్టర్ ఈదా శామ్యూల్‌రెడ్డిచే ప్రారంభించబడిన స్పందన ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత మూడున్నరేళ్ల కాలంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో 10 లక్షల మంది విద్యార్థులకు జీవిత పరమార్థాల్ని తెలియజేసిందన్నారు. ప్రముఖులతో చేసిన అవగాహన కార్యక్రమాల ద్వారా 600 మంది విద్యార్థులు ఆత్మహత్యల ప్రలోభాల నుంచి బయటపడ్డారని చెప్పారు. జీవీఆర్ కళాశాలతో పాటు విజన్ కళాశాల, స్కాలర్స్ స్టడీ సర్కిల్‌లో అవగాహన తరగతులు నిర్వహించినట్లు తెలిపారు. ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ శామ్యూల్ రెడ్డి సారథ్యంలో వచ్చేనెల 10వ తేదీ వరకు నెల రోజులపాటు ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని 500 కళాశాలల్లో ×జీవితం ఎంతో అమూల్యం – ఆత్మహత్యలు పరిష్కారం కాదు్ అంశంపై విద్యార్థుల్ని చైతన్యవంతం చేసే కార్యక్రమం కొనసాగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జాతీయ గౌరవ డైరెక్టర్ డాక్టర్ పి.కిశోర్‌కుమార్, కేంద్ర కమిటీ సభ్యులు ఎం.చిరంజీవి, వి.రామానుజమ్మ, పున్నయ్య, పి.శ్రీనివాసరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ జి.సునీల్, నాగరాజు, నరసింహారావు పాల్గొన్నారు.

సత్సంగంతో నిర్మలతత్వం



పెదపులుగువారిపాలెం(కర్లపాలెం): సత్సంగం వల్ల నిర్మలతత్వం సిద్ధిస్తుందని సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమ శంకర్‌రావు పేర్కొన్నారు. శనివారం పెదపులుగువారిపాలెం ఫౌండేషన్ ఆధ్వర్యంలో సత్సంగం కార్యక్రమం నిర్వహించారు. హేమశంకర్‌రావు మాట్లాడుతూ ప్రాణాయామం చేయటం వల్ల ఆరోగ్యంగా ఉంటారని, ఏకాగ్రత సాధ్యమవుతుందన్నారు. సనాతన హిందూ ధర్మాన్ని అందరూ ఆచరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ధర్మప్రచారక్ అక్కల సుబ్బారెడ్డి, గ్రామస్తులు శ్రీకాంత్‌రెడ్డి, వర్లా రెడ్డి, పోతురాజురెడ్డి, భాను ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

రజకులకు ఐదు అసెంబ్లీ సీట్లు కేటాయించాలి



మాట్లాడుతున్న ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు పాతపాటి

బాపట్ల: రానున్న ఎన్నికల్లో రజకులకు అన్ని రాజకీయ పార్టీలు సముచిత స్థానం కల్పించాలని, రజక సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు పాతపాటి అంజిబాబు పేర్కొన్నారు. మంగళగిరి సమీపంలో అక్టోబర్ 15న జరగనున్న రజక ఆత్మగౌరవ సభ సందర్భంగా బాపట్ల జిల్లా నాయకులతో గంగపుత్ర కాలనీలో శనివారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. రజకులకు రాష్ట్రంలో ఐదు అసెంబ్లీ స్థానాలు కేటాయించాలని కోరారు. అన్ని రాజకీయ పార్టీలు రజక సామాజిక వర్గ నేతలనే ఈ స్థానాల్లో అభ్యర్థులుగా ప్రకటించాలన్నారు. దీంతో ఏ పార్టీ అభ్యర్థి గెలిచినా రజకులు ఐదుగురు రానున్న అసెంబ్లీ సమావేశాల్లో అడుగుపెట్టే అవకాశం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా పేరాల సురేష్ మాట్లాడుతూ హలో రజక.. చలో గుంటూరు.. నినాదంతో వేలాది మంది తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బాపట్ల రవికుమార్, చేజర్ల సతీష్, చీమలదిన్నె నారాయణ, అంగలకుదురు నటరాజన్, ఉప్పలదిన్నె గోపీనాథ్, బాపట్ల శ్యామ్, కొండపాటూరు అంకినీడు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 520 కేసులు పరిష్కారం

రేపల్లె: లోక్ అదాలత్ ద్వారా కక్షిదారులు సత్వర న్యాయం పొందవచ్చని సీనియర్ సివిల్ జడ్జి టి.జగదీష్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక కోర్టు ప్రాంగణంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో ఆయన పాల్గొని, మాట్లాడారు. 470 క్రిమినల్, 20 సివిల్ కేసులు, 30 ప్రీ లిటిగేషన్లను పరిష్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎల్.జగదీష్‌కుమార్, లోక్‌అదాలత్ సభ్యులు కొండపల్లి శ్రీనివాసరావు, మోర్ల రామకృష్ణారావు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ దేవతలకు సారె, పొంగళ్ల సమర్పణ

కర్లపాలెం: గ్రామదేవత బురకాయలంకమ్మకు ఆట్లవారి వంశస్తులు శనివారం పొంగళ్లు, సారె సమర్పించి, పూజలు చేశారు. శ్రావణ మాసం సందర్భంగా గ్రామ దేవతలైన నాగమ్మతల్లి, వీర్లంకమ్మ తల్లికి కర్లపాలెం సెంటరులోని పెద్దింటమ్మ, కాళికమ్మ అమ్మవార్లకు పూజలు చేసి, సారె సమర్పించారు. పొంగళ్లు నివేదించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, గ్రామదేవతలకు పూజలు నిర్వహించారు.

వర్షాల నేపథ్యంలో అప్రమత్తత అవసరం



మురుగు కాల్వల్లో స్ప్రేయింగ్ చేస్తున్న సిబ్బంది

తెనాలిఅర్బన్: వర్షాలు పడుతున్న నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్ కోరారు. మలేరియా, ఫైలేరియా విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో ఇంటింటి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి దోమల వల్ల వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమకాటు వలన మలేరియా, ఫైలేరియా, డెంగీ, విషజ్వరాలు సోకే అవకాశం ఉందన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని చెప్పారు. అనంతరం మురుగు కాల్వలో స్ప్రేయింగ్, ఆయిల్ బాల్స్ వేశారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, సీనియర్ ఇన్‌స్పెక్టర్ జి.రవికుమార్, మలేరియా సిబ్బంది దీపాల శ్రీనివాసరావు, తిరువీధుల ప్రసాద్, బండారు మల్లేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

రైళ్లలో అగ్ని ప్రమాదాల నివారణపై మాక్‌డ్రిల్



మంటలను అదుపు చేయడాన్ని ప్రదర్శిస్తున్న సిబ్బంది

తెనాలిరూరల్: రైళ్లలో అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన చర్యల గురించి రైల్వే సిబ్బంది మాక్‌డ్రిల్ నిర్వహించారు. తెనాలి రైల్వే స్టేషన్ ప్రాంగణంలో శనివారం రైల్వే సిబ్బంది అగ్నిప్రమాదాలపై ప్రదర్శన ఏర్పాటు చేశారు. రైళ్లలో అగ్ని ప్రమాదాలను నివారించడం, మంటలు చెలరేగినప్పుడు తీసుకోవాల్సిన చర్యలు, పాటించాల్సిన పద్ధతుల గురించి ప్రదర్శన ఏర్పాటు చేయడంతో పాటు ప్రయాణికులకు వివరించారు. రైలు భోగీలో మంటలు లేదా పొగను గుర్తించిన వెంటనే టీసీ లేదా కోచ్ అటెండెంట్‌ను అప్రమత్తం చేయాలని సూచించారు. ప్రాణ నష్టం నివారించడంపై మాక్‌డ్రిల్ నిర్వహించారు. స్టేషన్ మేనేజర్ టీవీ రమణ, ఆర్పీఎఫ్ ఏఎస్ఐ శివరామకృష్ణయ్య, ఇతర రైల్వే అధికారులు పాల్గొన్నారు.

కొల్లిపర ఎంపీడీఓ విజయలక్ష్మి బాధ్యతలు స్వీకారం



ఎంపీడీఓ విజయలక్ష్మిని అభినందిస్తున్న ఎంపీపీ పద్మావతి, ప్రజాప్రతినిధులు

కొల్లిపర: కొల్లిపర ఎంపీడీఓగా విజయలక్ష్మి శనివారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈమె గతంలో చుండూరు మండలంలో ఈఓపీఆర్డీగా పనిచేసి పదోన్నతిపై కొల్లిపర ఎంపీడీఓగా రావటంతో ఎంపీపీ భీమవరపు పద్మావతి, అధికారులు, ప్రజాప్రతినిధులు ఆమెను పుష్పగుచ్ఛంతో అభినందించారు. గతంలో పనిచేసిన ఎంపీడీఓ శ్రీనివాసులు పదోన్నతిపై బదిలీ వెళ్లటంతో ఇప్పటివరకు ఇన్‌ఛార్జి ఎంపీడీఓగా చంద్రమోహన్ కొనసాగారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ మండలాన్ని అభివృద్ధి చేయటంతో తనవంతు కృషి చేస్తానన్నారు. మండల ఉపాధ్యక్షుడు అద్దంకి బోసుబాబు, హౌసింగ్ ఏఈ సుబ్బారావు, సీనియర్ అసిస్టెంట్ భీమవరపు మధుసూదనరెడ్డి, ఎంపీటీసీలు అవుతు బసవపున్నారెడ్డి, మర్రెడ్డి మాధవి, చిలుమూరు ఝాన్సీ, తూమాటి భీమారాణి, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలి

డాక్టర్ కిరణ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: సమస్యలనేవి ప్రతి ఒక్కరికీ ఎదురవుతాయని, వాటిని ధైర్యంగా ఎదుర్కోవాలని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ తెలిపారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం గుంటూరు జీజీహెచ్‌లోని శుశ్రుత హాలులో గుంటూరు వైద్య కళాశాల, గుంటూరు జీజీహెచ్ మానసిక వైద్య విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ×ఆత్మహత్యలు- అపోహలు- వాస్తవాలు₹ అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ సమస్యలు లేకపోతే జీవితం లేదని, ప్రశ్న లేకపోతే సమాధానం ఉండదని తెలిపారు. ప్రతి ఒక్కరూ నిరాశ, నిస్పృహ నుంచి బయటకు రావాలని ఆయన సూచించారు. సమాజంలో యువత దృఢంగా ఉండాలని చెప్పారు. ఒత్తిడిని దూరం చేసుకునేందుకు ఆటలాడాలని సూచించారు. గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నీలి ఉమాజ్యోతి మాట్లాడుతూ మానసిక వ్యాధితో బాధపడుతున్న వారంతా సరైన చికిత్స తీసుకుంటే తక్షణమే విముక్తి పొందవచ్చని తెలిపారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సాయికిరణ్ మాట్లాడుతూ విద్యార్థుల్లో ఒత్తిడి వల్లే ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని చెప్పారు. ఒత్తిడి నివారణకు సరైన సమయంలో మానసిక వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ డి.ఎస్.ఎస్. శ్రీనివాస ప్రసాద్, అసోసియేట్ ప్రొఫెసర్ వడ్డాది వెంకట కిరణ్, సివిల్ సర్జన్ ఆర్ఎంవో డాక్టర్ బత్తుల వెంకటసతీష్‌కుమార్, డాక్టర్ సాయికృష్ణ, డాక్టర్ శ్రీలక్ష్మి, డాక్టర్ కాత్యాయని, డాక్టర్ లవ్లీ పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధికి సీఎం వైఎస్ జగన్ శక్తివంచన లేని కృషి

- ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు
- వడ్డీవారిపాలెం సచివాలయ భవనం ప్రారంభం



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు

రేపల్లె రూరల్: ఆంధ్రప్రదేశ్ పురోభివృద్ధికి శక్తి వంచన లేకుండా పనిచేస్తూ.. ప్రజల నీరాజనాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందుకుంటున్నారని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. వడ్డీవారిపాలెంలో రూ.40 లక్షలతో నూతనంగా నిర్మించిన సచివాలయాన్ని శనివారం ఆయన ప్రారంభించి, మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజలకు పారదర్శకంగా పాలన అందించడానికి ముఖ్యమంత్రి సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చారని తెలిపారు. ఆధునిక దేవాలయాలు సచివాలయాలేనని, ప్రజలకు అన్ని రకాల సేవలు ఇక్కడ అందటమే ఇందుకు నిదర్శనమని ఎంపీ పేర్కొన్నారు. సచివాలయాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలతో ప్రజలు సంతృప్తి చెంది, ఆనందంగా ఉన్నారన్నారు. గతంలో ప్రభు త్వ కార్యాలయాల్లో ఏ చిన్న పని ఉన్నా ప్రయాణాలు చేసి, పనులు పూర్తి చేసుకునేందుకు రోజుల సమయం పట్టేదన్నారు. జగనన్న ప్రవేశపెట్టిన ఈ సచివాలయ వ్యవస్థతో సమయం, డబ్బు ఆదా కావటంతో పాటు ప్రజలకు సత్వర సేవలు అందుతున్నాయని చెప్పారు. అనంతరం సచివాలయ భ వనాన్ని ప్రారంభించి, శిలాఫలకాన్ని ఎంపీ మోపి దేవి ఆవిష్కరించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో బౌడా చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, వైఎస్సార్ సీపీ రూరల్ కన్వీనర్ గాదె వెంకయ్య, సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు మండలి అంజయ్య, సర్పంచ్ వడ్డీ సునీత, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ కార్పొరేషన్‌ల డైరెక్టర్లు, వలంటీర్లు, పాల్గొన్నారు.